సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణ రెడ్డి

తాగునీటి సమస్యను అధిగమించాలి

- రంగారెడ్డి కలెక్టర్ నారాయణ రెడ్డి
- సంబంధిత అధికారులతో సమీక్ష

ఆదిబట్ల, ఫిబ్రవరి 14 : రానున్న వేసవిలో తాగునీటి సమస్యను అధిగమించాలని రంగారెడ్డి కలెక్టర్ నారాయణ రెడ్డి సూచించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సంబంధిత జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా చూడాలన్నారు. ఇందు కోసం అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలో మిషన్ భగీరథ గ్రిడ్ ఇంట్రా తాగు నీటి సరఫరాలో భాగంగా చేపట్టిన పనులు, ప్రస్తుతం నీటి సరపరా జరుగుతున్న ఆవాసాలు, వాటర్ స్టోర్స్ ఇబ్బందులు తదితర అంశాలపై కలెక్టర్ ప్రతి డివిజన్ వారీగా అధికారులను అడిగి తెలుసుకున్నారు. వేసవిలో నీటి సరఫరా సమస్యలు ఎక్కడ ఉన్నా వెంటనే పరిష్కరించాలన్నారు. లీకేజీ మరమ్మతులు ఉంటే వెంటనే వాటిపై దృష్టి పెట్టి పరిష్కరించాలన్నారు. తాగునీటి సమస్యలు లేకుండా చూడాలన్నారు. ప్రతి ఒక్కరూ సమన్వయంతో పని చేయాలన్నారు. మండలాలు, మున్సిపాలిటీల్లో అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వేసవికి ముందే సమస్యను గుర్తించి పరిష్కరించాలని సూచించారు. ఇబ్బందులు ఉంటే ప్రత్యామ్నాయ ఏర్పాటు చేసుకోవాలన్నారు. సమావేశంలో మిషన్ భగీరథ ఈఈ రాజేశ్వర్, ఏఈలు, డీఈలు, అధికారులు పాల్గొన్నారు.

అరకొర అనుమతులు.. అంతా ఆక్రమణ

- మట్టి టిప్పర్లను నిలిపివేసిన సంగెం గ్రామ రైతులు
- కేశంపేట పోలీస్ స్టేషన్‌కు ఆందోళనకారుల తరలింపు

మట్టిని తరలిస్తున్న టిప్పర్‌ను నిలిపివేసిన సంగెం గ్రామస్తులు

కేశంపేట, ఫిబ్రవరి 14: అరకొర అనుమతులను సాకుగా చూపెడుతూ కొండంతా ఆక్రమణకు పాల్పడుతున్నారని సంగెం గ్రామ రైతులు మట్టిని తరలిస్తున్న టిప్పర్లను శుక్రవారం అడ్డుకొని ఆందోళనకు దిగారు. 3వేల మెట్రిక్ టన్నులకు అనుమతులు పొంది ఇప్పటివరకు అంతకు రెండింతల మట్టిని తరలించారని రైతులు ఆరోపిస్తున్నారు. సంగెం గ్రామంలోని 220/10/3లో నిబంధనల ప్రకారం ఫిబ్రవరి 3న అనుమతులు పొందామని చెబుతున్న కే.సురేశ్ అనే వ్యక్తి మట్టిని ప్రైవేటు వ్యక్తులకు సంబంధించిన పట్టా భూముల్లో ఎందుకు డంప్ చేస్తున్నదని రైతులు ప్రశ్నిస్తున్నారు. అధికార పార్టీకి చెందిన బడా నేతల ఒత్తిడితోనే మట్టి మాఫియా ఆగడాలకు అడ్డూ అదుపులేకుండా పోతున్నదని మహిళా రైతు సలీమా ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ప్రభుత్వం అసైన్డ్ చేసిన సర్వే నంబర్ 220/10/2లో భూమిలోనుంచి అక్రమంగా మట్టిని తరలించడం ఏమిటని, దాయాదుల మధ్య భాగ పరిష్కారం కాకుండానే తమ భూమిలో గోతులు తీస్తున్నారని కన్నీటి పర్యంతమయ్యారు. మట్టి తరలింపు విషయమై ఎస్వోటీ పోలీసులకు సమాచారం అందడంతో ఘటనా స్థలానికి చేరుకొని టిప్పర్లను నిలిపివేసి కేశంపేట పోలీసులకు అప్పగించే ప్రయత్నం చేశారు. స్పందించిన సీఐ నరహరి మట్టి తరలింపు విషయమై తమకు అనుమతులు ఉన్నాయని చెబుతున్నారని, నిజానిజాలను పరిశీలిస్తానని ఎస్వోటీ పోలీసులకు చెప్పడంతో అక్కడి నుంచి వారు వెనుదిరిగారు. మట్టిని తరలిస్తున్న టిప్పర్లను రైతులు నిలిపివేశారన్న విషయంమై స్థానిక పోలీసులకు సమాచారం అందడంతో రంగంలోకి దిగిన పోలీసులు ఆందోళనకారులను కేశంపేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వాస్తవానికి మట్టి తరలింపు అక్రమమా? లేక సక్రమమా అనేది అధికారుల పూర్తిస్థాయి విచారణలో తేలాల్సి ఉంది.

అన్ని ఏర్పాట్లు చేయాలి

- వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్
- పోలేపల్లి జాతర ఏర్పాట్లపై పరిశీలన
- సంబంధిత అధికారులతో సమీక్ష

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

కొడంగల్, ఫిబ్రవరి 14 : దుద్యాల మండల పరిధిలోని పోలేపల్లి ఎల్లమ్మ ఆలయంలో ఈ నెల 20 నుంచి నిర్వహించే జాతరలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆలయ ప్రాంగణంలో చేపడుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. పోలేపల్లి ఎల్లమ్మ వారిని సందర్శించుకున్న అనంతరం ఎస్పీ నారాయణరెడ్డి, సబ్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, సుధీర్‌తో పాటు సంబంధిత అధికారులతో ఆలయ ప్రాంగణ మందిరంలో కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాగునీరు, తాత్కాలిక మరుగుదొడ్లు, వైద్య సౌకర్యాలు, తాగునీటి వసతి తదితర సౌకర్యాలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండాలని సూచించారు. జాతరకు తరలివచ్చే భక్తులకు అన్ని ప్రాంతాల నుంచి బస్సు సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. అవసరమైతే అదనంగా బస్సులను ఏర్పాటు చేయాలని తెలిపారు. పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని తెలిపారు. ఈ నెల 21న ఈ ఉత్సవాలకు సీఎం విచ్చేస్తున్నారని ఈ నేపథ్యంలో పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. వారం పాటు జరిగే జాతర ఉత్సవానికి సుమారు లక్షకు పైగా భక్తులు వస్తారని తెలిపారు. వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేపడుతూ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. జాతర నిర్వహణపై రోజువారీగా సమీక్షించుకోవాలన్నారు. నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా ముందస్తుగా చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైతే జనరేటర్ ఏర్పాటు చేసుకునేలా అధికారులు జాగ్రత్త తీసుకోవాలన్నారు. వైద్య సేవలపై ప్రత్యేకంగా దృష్టి సారించి 24 గంటల పాటు డాక్టర్‌తో పాటు సిబ్బంది అందుబాటులో ఉండాలని తెలిపారు. శానిటేషన్ విస్తృతంగా చేపట్టి బ్లీచింగ్, తాగునీటి క్లోరినేషన్, దోమల నివారణకు ఫాగింగ్ తదితర వాటిని చేపట్టాలన్నారు. వాహనాలు పార్కింగ్ చేసుకోవడానికి ఏర్పాట్లు చేయాలని, ఇందుకు ఇంజినీరింగ్ శాఖ అధికారులు దృష్టి సారించాలని తెలిపారు. ప్రమాదాలు జరగకుండా ఆయా ప్రదేశాల్లో సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని, వాహనాల రద్దీ లేకుడా ట్రాఫిక్ జామ్ తదితర ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బార్‌కోడింగ్ పద్ధతి ద్వారా భక్తులకు దైవ దర్శనానికి అనుమతించాలని తెలిపారు. పోలీసుల, రెవెన్యూ, విద్యుత్, ఆరోగ్య శాఖల అధికారులు సమన్వయంతో బాధ్యతలు చేపట్టాలని పేర్కొన్నారు. అనంతరం హెలీప్యాడ్, పార్కింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, ఆలయ ఈవో రాజేందర్‌రెడ్డి, చైర్మన్ జయరాం, డీపీవో, ఆర్‌అండ్‌బీ, విద్యుత్ శాఖ ల అధికారులు పాల్గొన్నారు.

అప్పుకోసం ఆశ్రయిస్తే భూమిని కాజేశారు

- బోగస్ చెక్కులు చూయించి మార్టిగేజ్ అని చెప్పి సేల్‌డీడ్
- పోలీసులు, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసిన రైతులు
- రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని నిరసన

కులకచర్ల తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేస్తున్న ఆరుగురు రైతులు

కులకచర్ల, ఫిబ్రవరి 14 : అప్పుకోసం ఆశ్రయిస్తే భూమిని కాజేశారంటూ రైతులు పోలీసులను ఆశ్రయించారు. కులకచర్ల మండల పరిధిలోని అంతారం గ్రామానికి చెందిన ఆరుగురు రైతులు లింగంగారి వెంకటయ్య, కావలి పాండు, కావలి కృష్ణయ్య, లక్ష్మయ్య, రాములు, శ్రీనివాస్ తమ దగ్గర ఉన్న 5 ఎకరాల 32 గుంటల భూమిని తాకట్టు పెట్టి తమ సొంత అవసరాల నిమిత్తం ఎక్కడైనా అప్పు ఇప్పించాలని గ్రామ మాజీ సర్పంచ్ కృష్ణయ్యను ఆశ్రయించారు. ఆయన తనకు తెలిసిన వ్యక్తుల దగ్గర భూమిని తాకట్టు పెట్టి రూ.వందకు రెండు రూపాయల వడ్డీ చొప్పున రూ.40లక్షలు ఇప్పిస్తానని చెప్పగా రైతులు అంగీకరించినట్లు తెలిపారు. నవంబర్ 28న డప్పులు ఇప్పిస్తానని భూమిని మార్టిగేజ్ చేయించాలని ఆరుగురిని కులకచర్ల తహసీల్దార్ కార్యాలయానికి పిలిపించారు. దేవిరెడ్డి రత్నమ్మ పేరున భూమిని మార్టిగేజ్‌కు (తాకట్టుకు) బదులుగా సెల్‌డీడ్‌ను చేయించారు. అదే రోజు ఆ భూమిని రిజిస్ట్రేషన్ చేయించారు. డబ్బులు ఇవ్వాలని ఆరు గురు రైతులు అడిగారు. డబ్బులు వేరే కారులో ఉన్నాయని వారికి చెక్కులు ఇచ్చారు. వారు ఆ చెక్కులను తీసుకుని షాద్‌నగర్ ఐసీఐసీఐ బ్యాంకుకు డబ్బుల కోసం వెళ్లారు. చెక్కులు ఇచ్చిన ఖాతాల్లో నగదు లేదని బ్యాంకు అధికారులు తెలియజేశారు. తిరిగి ఇంటికి వచ్చిన రైతులు మాజీ సర్పంచ్ కృష్ణను నిలదీశారు. తమకు డబ్బులు ఇవ్వలేదని అడిగారు. తమ భూమికి సంబంధించిన వివరాలను ధరణి పోర్టల్‌లో చూసుకుంటే దేవిరెడ్డి రత్నమ్మ పేరు మీద కనిపిస్తున్నదని తెలిపారు. అప్పు ఇస్తామని చెప్పి డబ్బులు ఇవ్వలేదు.. తమ భూమి తమ పేరు మీద లేకుండా మార్టిగేజ్ (తాకట్టు) చేస్తామని సేల్‌డీడ్ చేసి తమను మోసం చేశారంటూ ఆరుగురు రైతులు లబోదిబోమంటూ కులకచర్ల పోలీస్‌లను ఆశ్రయించినట్లు రైతులు తెలియజేశారు. దీంతో పాటు తమ భూమికి సంబంధించి రిజిష్ట్రేషన్‌ను రద్దు చేయాలని కులకచర్ల తహసీల్దార్‌ను ఆశ్రయించారు.

రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలి

ఈ విషయమై పోలీసుల వివరణ కోరగా.. రైతులకు జరిగిన మోసంపై ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పూర్తి వివరాలు సేకరిస్తున్నామన్నారు. ఈ ఘటనపై మోసం చేసి రాయించుకున్నారని, రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని గురువారం కులకచర్ల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆరుగురు రైతులు నిరసన వ్యక్తం చేశారు. ఈ విషయంపై తహసీల్దార్ మురళీధర్‌ను వివరణ కోరగా భూమి పట్టాదారులు అమ్ముతున్నట్లు రిజిస్ట్రేషన్ చేయిస్తున్నట్లు వచ్చి సంతకాలు పెట్టి కొనుగోలు చేసిన వారి పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించారన్నారు. మిగితా వివరాలు తెలియవన్నారు. భూమిని మార్టిగేజ్ చేసిన సమయంలో రైతులకు సంబంధించిన భూమి పేరు మీద బ్యాంకుల్లో రుణాలు ఉన్నాయని ఎలా రిజిస్ట్రేషన్ చేశారని అడుగగా తమ దగ్గరకు సేల్ డీడ్ చేయడానికి మాత్రమే డాక్‌మెంట్లు తీసుకొచ్చారని తమ పద్ధతి ప్రకారం సేల్‌డీడ్ చేసే భూములకు ఎలాంటి అప్పు ఉన్నా చేస్తున్నామని, మార్టిగేజ్‌కు మాత్రం రిజిస్ట్రేషన్ చేయడం లేదని తెలిపారు. ఏది ఏమైనా తమకు న్యాయం చేయాలని బాధితులు పోలీస్టేషన్‌ను ఆశ్రయించారు.

భారత జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను... శుక్రవారం మిషన్ భగీథ మాజీ వైస్ చైర్మన్, తలకొండపల్లి మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం నాగర్‌కర్నూల్ జిల్లా జాగృతి నాయకురాలు మిరియాల పావని అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకున్న కవిత, హైదరాబాద్‌లోని అల్వాస్‌గూడలో ఆమెను కలిసి పరామర్శించారు. ఆమె వెంట మీర్‌పేట్ డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, వెంకటేశ్ ఉన్నారు.

- ఆమనగల్లు/కడ్తాల్, ఫిబ్రవరి 14

విద్యార్థులకు పౌష్టికాహారం అందజేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

వికారాబాద్, ఫిబ్రవరి 14 : ప్రభుత్వ వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశం హాలులో జిల్లాలోని 104 ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ప్రభుత్వ, గురుకుల వసతి గృహాలకు శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్, సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమా హారతితో కలిసి రూ.25 లక్షల విలువైన వంట సామగ్రిని వార్డెన్లకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుని నిధులను సమీకరించి వంట సామగ్రిని అందజేయడం అభినందనీయమన్నారు. ఈ వంట సామగ్రితో వసతి గృహాల్లో వంటలు మరింత సులభంగా, పరిశుభ్రంగా చేయడానికి ఉపయోగపడుతాయని, విద్యార్థులకు పౌష్టికాహారం అందుతుందన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని వసతి గృహాలను తనిఖీ చేసి, అక్కడ విద్యార్థినీ, విద్యార్థులకు కావాల్సిన మౌలిక వసతులు కల్పించామని పేర్కొన్నారు. కార్యక్రమమలో డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్, అధికారులు మల్లేశం, ఉపేందర్, కమలాకర్ రెడ్డి, రేణుకాదేవి పాల్గొన్నారు.

రంగరాజన్‌పై దాడి బాధాకరం

అర్చకుడు రంగరాజన్‌ను పరామర్శిస్తున్న మందకృష్ణ మాదిగ

మొయినాబాద్, ఫిబ్రవరి 14 : చిలుకూరు బాలాజీ ఆలయ అర్చకుడు రంగరాజన్‌పై దాడి చేయడం బాధాకరమని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని చిలుకూరు ఆలయ అర్చకుడు రంగరాజన్ ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగాన్ని ..చట్టాలను అదుపులోనికి తీసుకుని ఇష్టానుసారంగా అరాచకాలు సృష్టించే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. తప్పులు చేస్తే జైలు నుంచి బయటకు రామనే భయభ్రాంతులకు గురయ్యేలా చర్యలు ఉండాలన్నారు. కార్యక్రమంలో నాయకులు భీంభరత్, వెంకటయ్య, పృథ్వీరాజ్, ఇస్మాయిల్, గోవింద్ నరేశ్, వెంకటేశ్, దరువు ఎల్లన్న, సురేందర్, శంకర్‌మాదిగ, రా టవుగల్ల బాబు, నర్సింహ, శివశంకర్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

దాడులు చేయడం సరికాదు

ధర్మాన్ని కాపాడే వారిపై దాడులు చేయడం మంచి పద్ధతి కాదని ఎంపీలు ఈటల రాజేందర్, కొండ విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. చిలుకూరు బాలాజీ ఆలయ అర్చకులు సీఎస్ రంగరాజన్‌పై దాడి ఘటనను తెలుసుకుని శుక్రవారం వారు రంగరాజన్‌ను పరామర్శించారు. దాడి ఘటనకు సంబంధించి ఆయనను అడిగి తెలుసుకున్నారు. దాడిని తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దాడులకు పాల్పడిన వారిని చట్టపరంగా కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, నాయకులు ప్రకాశ్, ప్రభాకర్‌రెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

చిలుకూరులో అర్చకుడు రంగరాజన్‌ను పరామర్శిస్తున్న మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

వైర్లూనుకుపోయిన అవినీతి..!

విద్యుత్ శాఖలో అక్షయ పాత్రలా.. ఆ ఐదు సర్కిళ్ల పోస్టింగులు

- అత్యధికంగా సైబర్ సిటీ సర్కిల్ పరిధిలోనే ఏసీబీ కేసులు నమోదు
- కాసులిస్తే కారు దిగకుండానే సీఈజీఐ నిరభ్యంతర ధ్రువపత్రాలు



సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ): సైబర్ సిటీ సర్కిల్ పరిధిలోని ఒక ప్రాంతంలో వివాదాస్పద భూమి (కోర్టులో కేసు పెండింగు)లో ప్లాట్లకు మీటర్లు ఇచ్చేందుకు భారీ మొత్తాన్ని పుచ్చుకున్నారు. దీనిపై ఫిర్యాదులు పోవడంతో ఉన్నతాధికారులు ఒక అధికారిని బదిలీ చేయడంతో పాటు పలువురు అధికారులపై బదిలీ వేటు వేశారు. కానీ రోజుల వ్యవధిలోనే సదరు అధికారి పైరవీ చేసి ప్రభుత్వ పెద్ద ఒకరి ఆశీర్వాదంతో బదిలీ ఉత్తర్వులను రద్దు చేయించుకున్నారు. తిరిగి అదే స్థానంలో దర్జాగా విధులు నిర్వహిస్తున్నారు.

తాజాగా ఇదే సైబర్ సిటీ సర్కిల్ పరిధిలోని గచ్చిబౌలి ఏడీఈ కార్యాలయంలో రెండు అపార్టుమెంట్లకు కొత్త ట్రాన్స్‌ఫార్మర్ కోసం ఏడీఈ రూ. లక్ష లంచం డిమాండు చేశారు. ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్‌కు నిబంధనల ప్రకారమే రూ.4-5 లక్షలు అవుతుంది. అదనంగా ఏడీఈకి అమ్యామ్యాలు. సదరు యజమాని ఇంతకు ముందే రూ.25వేలు ఇచ్చారు. పాత బాకీ రూ.25, రెండో దానికి రూ. 50వేలు.. మొత్తం రూ.75వేలు ఇస్తేనే రెండో ట్రాన్స్‌ఫార్మర్ అమరుస్తామన్నారు. కడుపు మండిన యజమాని ఏసీబీకి సమాచారం ఇచ్చారు. శుక్రవారం రూ.50వేలు ఇస్తున్న సమయంలో ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

ఇదీ... విద్యుత్ శాఖలో వైర్లూనుకుపోయిన అవినీతికి ఓ మోస్తరు ఉదాహరణలు. కానీ బయటికి రాకుండా ఏటా కోట్లాది రూపాయలు అక్రమంగా చేతులు మారుతున్నాయి. అందుకే సైబర్ సిటీతో పాటు దక్షిణ డిస్కం పరిధిలో మరో నాలుగు సర్కిళ్ల పరిధుల్లో పోస్టింగులు అంటేనే భాలీ డిమాండు. ఇది నాణేనికి ఒకవైపు మాత్రమే! మరోవైపు బహుళ అంతస్తులతో పాటు వ్యాపార, పారిశ్రామిక కనెక్షన్లకు సీఈజీఐ నుంచి ఇవ్వాల్సిన నిరభ్యంతర ధ్రువపత్రం కోసం ఒక్కో కేసులోనే లక్షలాది రూపాయలు చేతులు మారుతున్నాయి.

అక్కడ కనిపించని అవినీతి కొండంత...

విద్యుత్ కొత్త కనెక్షన్ల వెనక అవినీతి భాగోతం ఇలా ఉంటే... భారీ నిర్మాణాలకు సంబంధించి కనెక్షన్లకు పొందాల్సిన ఎన్‌వోసీ జారీ అనేది కనిపించని అవినీతికి కేంద్రంగా మారింది. సాధారణంగా 15, అంతకుమించి మీటర్ల ఎత్తు ఉన్న బహుళ అంతస్తుల నిర్మాణాలకుగానీ భారీ వ్యాపార సముదాయాలు, పరిశ్రమలకు కరెంటు కనెక్షన్ మంజూరైతే... విద్యుత్ ప్రధాన తనిఖీ అధికారి (సీఈఐజీ - చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ టు గవర్నమెంట్) విభాగం వారు పరిశీలించి అన్ని రకాలు మంచిగా ఉందంటూ ఎన్‌వోసీ జారీ చేయాల్సి ఉంటుంది. పైగా ప్రతి సంవత్సరం ఈ ఎన్‌వోసీలను రెన్యువల్ కూడా చేయాల్సి ఉంటుంది. ఇదే ఆ విభాగానికి కాసుల వర్షాన్ని కురిపిస్తుందనే ఆరోపణలున్నాయి. సదరు తనిఖీ అధికారులు కారు దిగకుండానే దళారుల ద్వారా లక్షల రూపాయలు పుచ్చుకొని తనిఖీలు లేకుండా ఎన్‌వోసీలు జారీ చేస్తున్నారనే విమర్శలు బలంగా ఉన్నాయి. గతంలోనూ ఈ విభాగంలో ఏసీబీ వలకు చిక్కిన అవినీతి తిమింగళాలు కూడా ఉన్నాయి.

ఏసీబీ వలకు అవినీతి చేపలు..

విద్యుత్ శాఖలో తరచూ అవినీతి నిరోధక శాఖ వలకు అవినీతి చేపలు పడుతూనే ఉన్నాయి. కానీ బయటికిరాని ఇలాంటి అవినీతి భాగోతాలు ఎన్నో.. ప్రాణాలు లెక్కచేయకుండా కిందిస్థాయి ఆర్టిజెన్స్ సేవలు అందిస్తుంటే ఎగువ స్థాయిలో మాత్రం కుర్చీ కదలకుండా జోరుగా కాసుల దందా కొనసాగుతున్నది. అందుకే దక్షిణ డిస్కం పరిధిలోని ప్రధానంగా ఐదు సర్కిళ్ల పరిధుల్లో పోస్టింగుల కోసం భారీ ఎత్తున డిమాండు ఉంది. సైబర్ సిటీ, రాజేంద్రనగర్, సరూర్‌నగర్, మేడ్చల్‌తో పాటు సంగారెడ్డి సర్కిళ్ల పరిధుల్లో పోస్టింగుల కోసం లక్షలాది రూపాయలు ఇచ్చి వచ్చామని పలువురు అధికారులు బహిరంగంగానే చెబుతారు. ఈ ప్రాంతాల్లో కొత్త నిర్మాణాలు రావడంతో పాటు అపార్టుమెంట్లు, వ్యాపార, పారిశ్రామిక సముదాయాలు ఎక్కువగా వస్తాయి. దీంతో వీటికి కరెంటు కనెక్షన్లు ఇచ్చేందుకు పెద్ద ఎత్తునే చేతులు తడపాల్సి వస్తున్నది. అందుకే కేవలం గత ఆర్నెల్ల వ్యవధిలోనే నగరంలో వివిధ హోదాల్లోని ఏడుగురు విద్యుత్ శాఖ అధికారులు అవినీతి నిరోధక శాఖకు పట్టుబడ్డారు. అవినీతి ఫిర్యాదుల నేపథ్యంలో ఉన్నతాధికారులు మరో తొమ్మిది మందికి షోకాజు నోటీసులు జారీ చేశారు. ఇక... పైరవీలు లేకపోతే ఆ అధికారులకు పాతబస్తీ, కార్యాలయ విధులే శరణ్యం అవుతాయనేది విద్యుత్ శాఖలో బహిరంగ రహస్యం. అందుకే ఈ రెండు ప్రాంతాల్లో విధులను నాన్ ఫోకల్ పోస్టులుగా అభివర్ణిస్తారు.

బీ ఫార్మసీ పరీక్ష ఫీజు స్వీకరణ గడువు పొడిగింపు

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీలోని బీఫార్మసీ పరీక్ష ఫీజు స్వీకరణ గడువును పొడిగించినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీ ఫార్మసీ (పీసీఐ) 3, 5, 7 సెమిస్టర్ల మెయిన్, అన్ని సెమిస్టర్ల బ్యాక్లాగ్ పరీక్ష ఫీజును ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఈ నెల 20వ తేదీ వరకు సంబంధిత కళాశాలలో చెల్లించవచ్చని చెప్పారు.

వివిధ కోర్సుల పరీక్ష ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. అడ్వాన్స్‌డ్ పీజీ డిప్లమా ఇన్ హెల్త్ కేర్ కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్సైట్ www. osmania. ac. in లో చూసుకోవాలని సూచించారు.

పీహెచ్‌డీ కోర్స్ వర్క్ పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని పీహెచ్‌డీ కోర్స్ వర్క్ పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. 2022-23, 2023-24 బ్యాచ్‌లకు చెందిన బ్యాక్లాగ్ అభ్యర్థులు తమ పరీక్ష ఫీజును వచ్చే నెల 12వ తేదీ లోగా సంబంధిత డీన్ కార్యాలయంలో చెల్లించాలని సూచించారు. ఈ పరీక్షలను మార్చి, ఏప్రిల్ నెలల్లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని తెలిపారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్సైట్ www. osmania. ac. in లో చూసుకోవాలని సూచించారు.